క్లుప్తంగా

ఘనంగా పీర్ల పండగ



కంచికచర్ల: నందిగామ భారత్‌టాకీస్ రోడ్డు చిన్నమసీద్ వద్ద మొహర్రం పర్వదినం సందర్భంగా ముస్లింలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లిం పెద్దలు, మహిళలు, యువకులు పీర్లను దర్శించుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. పీర్లకు దట్టీలు కట్టి కానుకలు సమర్పించారు. పీర్ల పండగ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పండుగని హిందూ ముస్లింలు సోదర భావంతో అత్యంత వైభవంగా జరుపుకుంటారన్నారు. రానున్న రెండు రోజుల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ముస్లింలు తెలిపారు. అలాగే కంచికచర్ల మండలంలోని పరిటాల జెండాచెట్టు మసీదు వద్ద ముస్లింలు పీర్లపండగను ఆదివారం జరుపుకున్నారు. హిందూ ముస్లింలు ఐక్యంగా ఈ పండగను జరుపుకున్నారు. పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ సారె



కంచికచర్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి కాలినడకన తరలి వెళ్లారు. భక్తి పారవశ్యంతో జై వాసవి, జైజై వాసవి అంటూ అమ్మవారిని స్తుతిస్తూ పట్టణ పురవీధుల్లో తిరిగారు. ఆలయానికి తమ వెంట తీసుకువచ్చిన పూలు, పండ్లు, సారె, గాజులు, కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్టీసీ డిపో ఏడీఎంగా రజని



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా ఎం.రజని బాధ్యతలు తీసుకున్నారు. ఈమె నూజివీడు డిపో నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు డిపో సూపర్‌వైజర్ ఎస్‌కేఆర్ పాషా, బి.వాణి, డ్రైవర్ పి.శ్రీనివాసరావు కలిసిన వారిలో ఉన్నారు.

19న చేపలు పట్టుకునే హక్కుకు బహిరంగ వేలం

వీరులపాడు: మండలంలోని దాచవరం, జుజ్జూరు, కొణతాలపల్లి గ్రామాల్లోని మత్స్యశాఖ ఆధీనంలో ఉన్న చెరువులలో చేపలు పట్టుకొనే హక్కుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ లెనిన్‌బాబు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని దాచవరం చెరువు, జుజ్జూరు ఊర చెరువు, కొణతాలపల్లి గ్రామంలోని చింతల చెరువులో చేపలు పట్టుకునే హక్కుకు ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఒక్కో చెరువుకు రూ. మూడు వేల దరావత్ చెల్లించి పాటలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు 7989855026, 9394132213లలో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో యాగం



జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టిసీమ ద్వారా కృష్ణమ్మ, గోదావరి నదులను అనుసంధానం చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో వేంచేసియున్న యజ్ఞదత్తాత్రేయ స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న అష్టవాజపేయ, బృహస్పతి నవ యాగంలో ఆదివారం ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ సమాజ సంక్షేమాన్ని ఈ ప్రాంత సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ యాజులు కుటుంబ సభ్యులు యాగం నిర్వహించటం అభినందనీయమని తెలిపారు.

ప్రైవేటు నర్సరీలతో జరభద్రం

- ఏ మాత్రం పొరపాటు జరిగినా రైతుకు తీవ్ర నష్టం
- నారు నాణ్యతలో రాజీకి వీల్లేదు
- నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలంటున్న అధికారులు



నర్సరీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఉద్యాన శాఖాధికారులు(ఫైల్)

పెనుగంచిప్రోలు: మిర్చి సాగు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. ఎక్కడ ఏ పొరపాటు జరిగినా రైతు కోలుకోని విధంగా దెబ్బతింటాడు. ఇతర వాణిజ్య పంటలతో పోలిస్తే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా నారు కొనుగోలు సమయంలో మోసపోతే రైతు పరిస్థితి దారుణంగా ఉంటుంది. పైరు ఏపుగా పెరిగినా, ఎన్ని మందులు వాడినా దిగుబడి రాకుండా నష్టపోతుంటారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు నర్సరీల్లో నారు నాణ్యంగా లేక రైతులు నష్టపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు నర్సరీల ద్వారా రైతులు మోసపోకుండా ఉండేందుకు విత్తన చట్ట ప్రకారం నిబంధనలు నర్సరీల నిర్వాహకులు పాటించాల్సిందే. రైతులు విత్తనం ఎక్కడ కొనుగోలు చేస్తున్నారు? ఎలా పెంచుతున్నారు? రైతులకు ఎలా ఇస్తున్నారనే విషయాలపై ఉద్యాన శాఖతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు కూడా పర్యవేక్షణ చేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలో మిర్చి ఈఏడాది సుమారుగా 40 వేల ఎకరాల్లో సాగు కానుంది. ఎకరానికి కనీసం 14 నుంచి 15 వేల మొక్కలు అవసరం కానున్నాయి. మిరప నారు పెంచేందుకు జిల్లాలో లైసెన్స్ కలిగిన 198 షేడ్ నెట్ నర్సరీలు ఏర్పాటు అవుతున్నాయి. ఇవి ఏడాదికి 10 కోట్ల మొక్కలు ఉత్పత్తి చేస్తాయి. రైతులు మన జిల్లాతో పాటు పక్కన ఉన్న గుంటూరు, ప్రకాశం జిల్లా, తెలంగాణా రాష్ట్రంలోని సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుంచి కూడా నారు కొనుగోలు చేస్తున్నారు.

నకిలీ నారుతో నష్టం..

గతంలో నకిలీ నారుతో రైతులు నష్టపోయిన సందర్భాలు ఉన్నాయి. మిర్చి సాగు ఎకరానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. షేడ్‌నెట్ నర్సరీల నిర్వాహకులు రైతులకు నకిలీ విత్తనాల నారు సాగు చేసి నష్టపోతే.. రైతు సాగులో లోపాల వల్లే ఇలా జరిగిందని తప్పించుకుంటున్నారు. వీటన్నంటినీ దృష్టిలో ఉంచుకొని నర్సరీల నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నర్సరీలు పాటించాల్సిన నిబంధనలు..

- నారు పెంచే నర్సరీ చుట్టూ ఇన్‌సెక్ట్ నెట్ ఉండాలి.
- ఇన్‌సెక్ట్ నెట్‌కు ఎటువంటి చిల్లులు లేకుండా చూసుకోవాలి.
- డబుల్ డోర్‌కు ఎటువంటి సందులు లేకుండా ఉండాలి.
- షేడ్‌నెట్‌కు 3 అడుగుల విస్తీర్ణం వరకు ఎటువంటి కలుపు, చెట్లు ఉండకూడదు. నర్సరీకి సంబంధించిన ఏడు రిజిస్టర్లలో పూర్తి వివరాలు నమోదు చేయాలి.
- నర్సరీ లైసెన్స్ నంబర్ ప్రింట్ అయిన బిల్లులు మాత్రమే నారు కొనుగోలు దాకరులకు ఇవ్వాలి.
- నర్సరీ లోపల పసుపు రంగు జిగురు అట్టలు పెట్టాలి.
- నర్సరీ లోపల వైరస్ నిర్మూలనకు చుట్టూరా ట్రాప్-క్రాప్(బంతి మొక్కలు) వేయాలి.
- నర్సరీ పేరును సూచిస్తూ నర్సరీ బయట పెద్ద బోర్డును ఏర్పాటు చేయాలి.
- ప్రతి బెడ్డుకు ముందు ఆ బెడ్డులో పోసిన నారును సూచిస్తూ కంపెనీ, వెరైటీ, నాటిన తేదీ మొదలగు వివరాలు గల బోర్డును ఏర్పాటు చేయాలి.
- నాణ్యమైన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన కంపెనీల నుంచి బిల్లులు, జీఓటీ రిపోర్టులు తీసుకోవాలి.

విస్తృతంగా తనిఖీలు..



జిల్లాలో లైసెన్స్ కలిగిన 198 షేడ్‌నెట్ నర్సరీలు ఉన్నాయి. రైతులకు నాణ్యమైన నారు అందించేందుకు రూపొందించిన నిబంధనలు నర్సరీ నిర్వాహకులు పాటించేందుకు చర్యలు చేపట్టాం. నర్సరీల్లో తనిఖీలు చేపట్టడంతో పాటు అవసరమైన సూచనలు అందిస్తున్నాం. నర్సరీల్లో నారు కొనుగోలు చేసేటప్పుడు రైతులు కంపెనీ రకం, లాట్ నంబర్ తదితర వివరాలతో కూడిన రశీదులను అడిగి తీసుకోవాలి. వీలైనంత వరకు రైతులే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి నర్సరీలో పెంచుకోవాలి.

– బాలాజీ కుమార్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

హడలెత్తిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు

- చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌లు.. కనపడని రక్షణ కవచాలు
- పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు
- కురుస్తున్న వర్షాలకు.. ఆందోళన చెందుతున్న ప్రజలు



కంచికచర్ల, జుజ్జూరు రోడ్డులో పిచ్చి చెట్ల మధ్యన చేతికందే ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



జుజ్జూరులో నివాస గృహాల మధ్యన దట్టంగా పెరిగిన చెట్లతో దర్శనమిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

వీరులపాడు: వీరులపాడు, కంచికచర్ల మండలాలలోని ఆయా గ్రామాలలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు హడలెత్తిస్తున్నాయి. చేతికందే ఎత్తులో ఉండటం.. కురుస్తున్న వర్షాలకు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతుంటే విద్యుత్ శాఖాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాలలో విద్యుత్ శాఖాధికారులు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లు చేతికందే ఎత్తులో ఉన్నాయని కనీసం ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కవచాలు కూడా లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కంచికచర్ల పట్టణంలోని అరుంధతీ కాలనీ, జుజ్జూరు రోడ్డు, అంబేడ్కర్ కాలనీ, జుజ్జూరు, అల్లూరు గ్రామాలలోని రహదారుల వెంబడి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చేతికందే ఎత్తులో ఉండటంతో పాటు దట్టంగా పెరిగిన పిచ్చి చెట్లతో నరకమార్గాలుగా దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు. అంతే కాకుండా రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడాల్సి వస్తుందోనని భయాందోళన చెందుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు విద్యుత్ అధికారులను కోరినా వారి నుంచి స్పందన లేదని ప్రజలు చెబుతున్నారు.

భక్తులతో పోటెత్తిన

తిరుపతమ్మ ఆలయం

స్థానిక తిరుపతమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆషాఢమాసం సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సారె సమర్పించారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

– పెనుగంచిప్రోలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



క్యూలైన్‌లో నుంచి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మురుగు పారేదెలా?





5వ వార్డులో మురుగు కాలువల దుస్థితి

జగ్గయ్యపేట అర్బన్: పేట పురపాలక సంఘం పరిధిలో పలు వార్డుల్లో పారిశుద్ధ్యం పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికే పారిశుద్ధ్య సమస్యతోనే ఓసారి డయేరియా ప్రబలిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హడావుడి చేసిన మున్సిపల్ సిబ్బంది మళ్లీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో 5వ వార్డులో మురుగునీటి పారుదల అధ్వానంగా మారిందని ఆ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ ఆరోపించారు. వార్డులో డ్రెయిన్లన్నీ వ్యర్థాలతో పూడిపోయాయని, కొన్ని చోట్ల డ్రెయిన్లలో పిచ్చిమొక్కలు పెరిగి మురుగునీరు ముందుకు కదలక నిలిచిపోవడంతో దోమల వృద్ధి చెందుతున్నాయని వివరించారు. మురుగు కంపుతో భరించలేకపోతున్నామని వార్డు ప్రజలు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారని కౌన్సిలర్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు పలు మార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా నరసింహుని గరుడసేవ



వేదాద్రి(జగ్గయ్యపేట): స్థానిక యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి గరుడసేవ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం ఆలయ సమీపంలోని కృష్ణానదిలో కృష్ణమ్మకు నక్షత్ర హారతి ఇచ్చారు. అర్చకులు వేదాంతం యోగానందాచార్యులు మాట్లాడుతూ భక్తుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జల బిందెలతో ఆషాఢ పూజలు



జలబిందెలతో తరలివస్తున్న శాంతినగర్ మహిళలు

జగ్గయ్యపేట అర్బన్: ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని శాంతినగర్, పుట్టబజారులో వేంచేసియున్న శ్రీకలకత్తా కాళీమాత శివదుర్గా భవానీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ అర్చకులు టీవీ భరద్వాజ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి బంతిపూల దండలతో ప్రత్యేక అలంకరణ చేశారు. నైవేద్యాలు సమర్పించారు. అలాగే అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. శాంతినగర్‌కు చెందిన మహిళలు జలబిందెలతో అమ్మవారి నామ స్మరణ చేస్తూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు.

నందిగామ ఎమ్మెల్యేకు సత్కారం



చర్చి సభ్యులతో ఎమ్మెల్యే సౌమ్య

కంచికచర్ల: నందిగామ పట్టణంలోని ఆర్సీఎం చర్చిలో సంఘస్తులు, విశ్వాసులు, విచారణ గురువులు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తన తండ్రి దివంగత తంగిరాల ప్రభాకరరావును ఆర్సీఎం సంఘస్తులు ఎంతగానో అభిమానించి ఆదరించారని, తనపై కూడా చూపుతున్న ఆదరణ, ప్రేమకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చర్చి ఫాదర్ పులుగు విజయకుమార్, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆషాఢ సారె..

పట్టణంలోని పెద్దబజార్‌లో కొలువై ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆషాఢ సారెను సమర్పించారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు ఎమ్మెల్యేకు సారె సమర్పించారు. కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు, మహిళలు, పాల్గొన్నారు.

రేపటి నుంచి పాండురంగడి కల్యాణోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వార్ల కల్యాణోత్సవాలు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 16వ తేదీన ఆలయంలో కొలువై ఉన్న రుక్మాబాయి పాండురంగస్వామి వార్లకు సంతాన వేణుగోపాలస్వామి వార్ల మూలమూర్తులకు పంచామృత తిరుమంజన అభిషేకాలు జరుగుతాయన్నారు. అనంతరం స్వామి వార్లకు నూతన వస్త్ర సమర్పణ, పెళ్లికుమారుడిగా అలంకరణ తదితర కార్యక్రమాలు, సాయంత్రం ప్రత్యేక ఊంజల్ సేవను నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన ఉదయం స్వామి వారికి తొలి ఏకాదశిని పురస్కరించుకొని మూలమూర్తులకు పంచామృత తిరుమంజన అభిషేకాలు, అనంతరం ప్రత్యేక అలంకారం చేస్తారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. 18వ తేదీన ఉదయం స్వామి వారికి తులసీదళార్చనను జరుపుతారు. సాయంత్రం సమస్త దీపాలంకరణ, పవళింపు సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు.


ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వాణి హైస్కూల్ డైరెక్టర్ శేషుబాబును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గా అగ్రహారం వాణి హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. 2003–2004 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు నగరంలో సమావేశమయ్యారు. 21 సంవత్సరాల తరువాత కలిసిన స్నేహితులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. పాఠశాలలో నాటి జ్ఞాపకాలను చిన్నప్పుడు చేసిన అల్లరిని గుర్తుకు తెచ్చుకున్నారు. చిన్ననాటి స్నేహితులతో కలిసి ఆడిపాడి సందడి చేశారు. దేశ విదేశాల్లో పలు హోదాలలో ఉన్నప్పటికీ వారి బాధ్యతలను మర్చిపోయి స్నేహితులతో అల్లరి చేశారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ అంజూరు శేషుబాబు, ఉపాధ్యాయులను సత్కరించారు.

ముగిసిన జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు



విశేష అలంకరణలో స్వామి వార్లు

ఆటోనగర్(విజయవాడతూర్పు): జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా ముగిశాయి. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రథ యాత్ర మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. చివరి రోజు స్వామి వారికి 108 రకాల వంటకాలతో భోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విజయవాడ చుట్టుపక్క ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. 16వ డివిజన్ పాత వీబీఎం కాలేజీ ఆవరణలోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుండిచ మందిరంలోని జగన్నాథస్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రదారిధాస్ అందజేశారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షులు చక్రదారిధాస్ వేణుదారిదాస్, బలరామ గోవిందదాస్, పీఆర్‌ఓ శ్యాంసుందర అచ్యుతదాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వారాహి డ్యాన్స్ అకాడమీకి చెందిన నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయంలోని ధర్మపథం వేదికపై పంచహారతుల సేవ అనంతరం శంకరమంచి ఆదిలక్ష్మి పర్యవేక్షణలో శిష్యబృందం పలు కీర్తనలకు చక్కటి హావ భావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

దుర్గమ్మకు సారె సమర్పించిన బృందాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి పెద్ద ఎత్తున భక్తులు సారెను సమర్పించారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్త బృందాలు నిర్విరామంగా సారెను సమర్పించారు. విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన అరుణ బృందంకు చెందిన వంద మంది, శ్రీశైవల్యాకృతి సేవా సమితికి చెందిన 125 మంది, దుర్గాభవానీ ఆలయం నుంచి 150 మంది భక్తులు, పి.లక్ష్మీ బృందానికి చెందిన 100 మంది, డి. శ్రీనివాస్ బృందానికి చెందిన 200 మంది, జి.పార్వతి బృందానికి చెందిన 150 మంది, కె.కల్యాణి బృందానికి చెందిన 100 మంది, ఎం.రామకృష్ణ బృందానికి చెందిన 100 మంది, చిట్టినగర్‌కు చెందిన పార్వతిదేవి బృందానికి చెందిన మరో 100 మందితో పాటు మొత్తంగా వందకు పైగా బృందాలు, 3,500 మంది సభ్యులు అమ్మవారికి సారెను సమర్పించారు.